సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

"లేదు" కరుణాకర్ కంఠం నిర్లక్ష్యంగా ధ్వనించింది.

"మిష్టర్ రామానుజం!" గజాననరావు కంఠం కోర్టు హాల్లో మారుమ్రోగింది.

కాస్సేపట్లో పంచా, జుబ్బా ధరించిన వృద్ధుడు మెల్లిగా నడుస్తూ బోనులో ఎక్కాడు. దళసరి కళ్ళద్దాలు మాసిన గడ్డం, విచారం నిండిన మొహం.

"రామానుజంగారూ, గీత మీకు యేమవుతుంది?" ప్రాసిక్యూటర్ ప్రశ్నించాడు.

రామానుజం బాధ నిండిన కళ్ళతో చూశాడు. అదురుతున్న అతని పెదవులు మెల్లిగా కదిలాయి. "గీత....గీత నా....నా పెద్ద కూతురు...."

"విచారంలో మునిగిపోయిన మిమ్మల్ని కష్టపెడుతున్నందుకు చింతిస్తున్నా. గీతను కరుణాకర్ దగ్గర మీరే అప్రెంటిస్ గా చేర్పించారా?"

రామానుజం మాట్లాడకుండా తన చూపుల్ని కరుణాకర్ వైపు తిప్పాడు. అసహ్యం, ఆగ్రహం అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తున్నాయి. పెదవులు మళ్ళీ అదరడం ప్రారంభించాయి.

"లేదు .... ఎవరో లేడీ అడ్వొకేట్ దగ్గర చేరమన్నాను. కానీ అమ్మాయి నా మాటల్ని పెడచెవిని పెట్టింది. ఏదో కేసు సందర్భంలో ప్రతిరోజూ అతని పేరు పేపర్లలో కనిపించడమే దాని వ్యామోహానికి కారణం. అతను....అతను చాలా తెలివైన లాయరని దాని నమ్మకం....పిచ్చి అపోహ...."

"రామానుజంగారూ, మీకు ముద్దాయి కరుణాకర్ తో బాగా పరిచయం వుందా?"

"అమ్మాయి రెండుసార్లు నన్ను అతని దగ్గరకు తీసుకెళ్ళింది. అతను తరచుగా మా ఇంటికి వచ్చేవాడు. అంతే."

"మీ అమ్మాయి అతనిపట్ల యే విధంగా ప్రవర్తించేది?" ప్రాసిక్యూటర్ ప్రశ్నించాడు.

రామానుజం బరువుగా నిట్టూర్చాడు. "అమ్మాయి... అతన్ని చాలా గౌరవంగా చూసేది. అతనంటే దాని కెంతో అభిమానం. తను ప్రేమించే అన్నయ్య ముందు, అమాయకురాలైన ఆడపిల్ల ఎలా ప్రవర్తించేదో, అతని ముందు అమ్మాయి అలా ప్రవర్తించేది. కానీ.... పైకి కనిపించే అతని మానవ రూపం వెనక నక్కి దాక్కున్న దానవుణ్ని ఆ పసిది చూడలేకపోయింది...."

"మీరు చూశారా?" ప్రాసిక్యూటర్ ప్రశ్నించాడు.

రామానుజం తల వెనక్కి ముందుకీ ఆడించి. నిట్టూర్పు అతని వ్యధని వెలికి చిమ్మింది. "చూశాననే అనుకుంటున్నాను. అతను అమ్మాయిపట్ల అవసరాన్ని మించిన అభిమానాన్ని ప్రదర్శించేవాడు. అనవసరంగా అమ్మాయిని పొగిడేవాడు. ఆర్నెల్లలో మా ఇంటికి చాలాసార్లు వచ్చాడు. అతను ప్రదర్శించిన అభిమానం, మెప్పు మోతాదు మించినవిగా నాకు అనిపించేవి. అతని కళ్ళు అసిస్టెంట్ ని చూసే లాయరు కళ్ళలా నాకు అవుపించేవి కావు...."

"ఐసీ.... మీరు అమ్మాయిని హెచ్చరించలేదా?" ప్రాసిక్యూటర్ ప్రవాహానికి అడ్డు తగిలాడు.

"చాలాసార్లు. కానీ అమ్మాయి మొండి. లా చదవొద్దని యెంత మొత్తుకున్నా వినలేదు. తన గురువు విషయంలో నేను పొరబడుతున్నానని వాదించేది. గొర్రె కసాయివాడ్ని నమ్మినట్టు అది అతన్ని నమ్మింది!" రామానుజ కంఠం బొంగురుపోయింది.

"అయామ్ సారీ. మూడో తారీఖు రాత్రి టాక్సీ ఆమెకోసం వచ్చినప్పుడు మీరు ఇంట్లో వున్నారా?"

"ఉన్నాను."

"టాక్సీ డ్రైవర్ని చూశారా?"

"చూశాను. ఇందాకా ఇక్కడ నుంచున్నతనే."

"అంత రాత్రివేళ అమ్మాయిని వెళ్ళొద్దనలేదా?" ప్రాసిక్యూటర్ అడిగాడు.

"వెళ్ళొద్దన్నాను. మర్నాడు ట్రయల్ కి రాబోయే కేసు గురించి డిస్కస్ చేయడానికి అతను రమ్మన్నాడంది. దానిమీద అతనేదో మత్తుమందు చల్లాడు. నేను

యెప్పుడేనా హెచ్చరిస్తే అతని తరఫున నాతో వాదించేది. చివరికి తన అజ్ఞానానికి అది బలైపోయింది!” రామానుజం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

“రామానుజంగారూ, అమాయకురాల్ని బలితీసుకున్న దుష్టశక్తి త్వరలో చట్టానికి బలైపోతుంది; విచారించకండి!” ప్రాసిక్యూటర్ ఉద్రేకంతో అన్నాడు.

రామానుజం దీనంగా చూశాడు. “ఇక మాకు మిగిలింది విచారమే!”

ప్రాసిక్యూటర్ గజాననరావు కరుణాకర్ వైపు చూశాడు.

“యూ మే క్వెశ్చన్ ది విట్నెస్!” అన్నాడు సవాలు చేస్తున్నట్టు.

“నో క్వెశ్చన్” కరుణాకర్ తల అడ్డంగా ఊగింది. అతని చేతులు బోను ఫ్రేమ్‌మీద బిగుసుకున్నాయి. కన్నీళ్ళతో, తన ఎదురుగా బోనులో నిలబడ్డ గీత తండ్రిని అతను సానుభూతితో చూశాడు.

అతని మాటలు తనలో ఆగ్రహాన్ని పుట్టించడంలేదు. గీతపట్ల తనకున్న ఆదరాభిమానాల్ని ఆయన అపార్థం చేసుకున్నట్టు తనకి అప్పట్లో తెలీదు. కానీ, కూతురు దారుణంగా చెరచబడి హత్యచేయబడ్డాక, తను హంతకుడిగా చిత్రించబడ్డాక ఆయన తన ప్రవర్తనని అపార్థం చేసుకొనేలా సన్నివేశాలు చిత్రించబడ్డాయి. సాక్ష్యాలు రూపొందించబడ్డాయి. తను అబద్ధాలుగా నిరూపించలేని సన్నివేశాలూ; సాక్ష్యాలూ!

కానీ, నిజాన్ని నిజంగా, అబద్ధాన్ని అబద్ధంగా నిరూపించే అవసరం తనకిలేదు. తనని నర్మద దగ్గరకు తీసుకెళ్ళే తీర్పుకోసం, జడ్జిమెంట్ కోసం తను యెదురు

చూస్తున్నాడు!

"నర్మద... నర్మద.... నర్మదా. ఈ చేతుల్తో, నిన్ను అక్కున చేర్చుకున్న ఈ చేతుల్తో నిన్ను ఆరాధించిన ఈ చేతుల్తో, గుడ్డివాడిలా నీకు విషం తాగించాను! నర్మదా, నా ప్రేమలో యేదో లోపం వుంది. లేకపోతే నా ప్రేమ ఆ విషాన్ని అమృతంగా మార్చివుండేది...."

కరుణాకర్ హృదయం బావురుమంటోంది. కరిగిపోతో, కన్నీరుగా మారుతోన్న హృదయాన్ని రాయిలా మార్చుకుంటూ అతను ఈ లోకంలోకి వచ్చాడు.

ప్రాసిక్యూటర్ విజయోత్సాహంతో వున్నాడు. ఉపన్యాసం ప్రారంభించబోయే రాజకీయ నాయకుడు సభను కలయజూసినట్టు, హుందాగా కోర్టంతా కలయజూశాడు.

"మిష్టర్ జస్టిస్ అండ్ మెంబర్స్ ఆఫ్ ది జ్యూరీ.." గంభీరమైన కంఠంతో ప్రాసిక్యూటర్ ప్రారంభించాడు: "ముద్దాయి కరుణాకర్ తన భార్యను ప్రేమించలేదనీ, తన దగ్గర అప్రెంటిస్ చేస్తున్న కుమారి గీతను అక్రమంగా ప్రేమిస్తూ వచ్చాడనీ సాక్ష్యాలవల్ల రుజువైంది.

"న్యాయశాస్త్ర పట్టభద్రుడైన ముద్దాయి, రాక్షసుడుగా మారి, గర్భవతి అయిన భార్యనూ, అభం శుభం యెరగని, గీతను, భవిష్యత్తు గురించి బంగారు కలలు గంటున్న కన్నెపిల్లనూ తన స్వార్థానికి బలి తీసుకున్నాడు. చట్టప్రపంచానికీ, మహిళాలోకానికీ ఇది ఘోరమైన అవమానం! ఈ నేరాల్ని ముద్దాయి చేశాడని నిర్ద్వంద్వంగా, పటిష్టమైన సాక్ష్యాధారాల్తో, సందేహానికి తావు లేకుండా నిరూపించబడింది.

"కామంతో, స్వార్థంతో నిండు ప్రాణాల్ని—ఒకే

రాత్రి రెండు నిండుప్రాణాల్ని బలిగొన్న ముద్దాయిని దాక్షిణ్యం లేకుండా తగిన శిక్ష విధించాలని కోర్టువారిని కోరుతున్నా. ఇదీ ప్రాసిక్యూషన్ కేసు!" ఉద్రేకంతో ఏకబిగిని చెప్పి ముగించాడు గజాననరావు ఠీవిగా నడుస్తూ వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నాడు.

జడ్జి గోస్వామి కరుణాకర్ వైపు చూశాడు. "డిఫెన్స్ తరఫున సాక్ష్యాల్ని ప్రవేశ పెట్టొచ్చు" అన్నాడు.

కరుణాకర్ వెర్రివాడిలా జడ్జి వైపు చూశాడు. "సాక్ష్యాలు లేవు మిస్టర్ జస్టిస్ ..." అన్నాడు మెల్లగా.

జడ్జి గోస్వామి సానుభూతితో తల పంకించాడు. "మీరు చెప్పుకోవాల్సింది ఏమైనా వుందా?"

కరుణాకర్ రెప్పలెత్తి అతన్ని చూశాడు. మండుతున్న నిజానికి ప్రతిరూపాల్లా, ఎర్రగా వున్నాయి అతని కళ్ళు. "మిస్టర్ జస్టిస్.... నేను చెప్పుకునేది ఒక్కటే: ఈ నేరాలేవీ నేను చేయలేదు!"

జడ్జి గోస్వామి అతన్ని తీక్షణంగా చూశాడు. "మీ మాట—మీ మీద ఆరోపించబడి, నిరూపించబడిన నేరాల్ని తుడిచివేయలేదు! తగు విధంగా దాన్ని నిరూపించుకోవాలి ...."

"నిజాన్ని నిరూపించాల్సిన అవసరంలేదు! మిస్టర్ జస్టిస్, మీ తీర్పు యివ్వండి!" కరుణాకర్ కంఠం గంటలా మ్రోగింది.

జడ్జి గోస్వామి జ్యూరీ సభ్యులతో యేదో చెప్పాడు. అందరూ లేచి లోపలి ఛాంబర్ లోకి వెళ్ళారు. నిమిషాలు గడుస్తున్నాయి. ఎవరో అడ్వొకేటు తన ముందు నిలబడి తగ్గుస్వరంలో యేదో చెప్తున్నాడు.

కానీ, అతని మాటలు తన చెవుల్ని తాకటంలేదు. తన చెవుల్లో ఇందాకా సాక్షులు పలికిన మాటలు కఠోరంగా ప్రతిధ్వనిస్తున్నాయి. తనకు తెలిసినవాళ్ళూ, తెలీనివాళ్ళూ అందరూ అబద్ధాలాడుతున్నారు!

ఈ అబద్ధాల్ని పలికిస్తున్న శక్తి యేది? ఆ శక్తికి తనేం అపకారం చేశాడు? తనని ఇంట్లోంచీ తీసుకెళ్ళి, తన చేతుల్లో గీత మొహంమీది తలగడను అదిమిపెట్టి దారుణంగా ఆమెని చంపిన ఆ రాక్షసులిద్దరూ యెవరు? కోర్టులో వాళ్ళు కూడా తనకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి రావొచ్చని తను ఊహించాడు. కానీ వాళ్ళు మళ్ళీ తనకి కనిపించలేదు.

వాళ్ళే హార్లిక్స్‌లో సైనైడ్ కలిపివుంటారు! తనమీద అంత శత్రుత్వం ఎవరికివుంది? దారితప్పి సాగిపోతున్న ఆలోచనల్ని బలవంతంగా అదుపులో పెట్టుకున్నాడు కరుణాకర్. ఎవరు యెవరైనా తనకి అవసరంలేదు. తన నర్మదని తననుండీ దూరంచేసిన వ్యక్తులున్న లోకంతో తనకి పనిలేదు....

కరుణాకర్ తల మెల్లిగా కొద్దిగా పక్కకు తిరిగింది. జడ్జి గోస్వామి యేదో చదువుకుపోతున్నాడు. ప్రాసిక్యూటర్ ఉద్రేకంతో గొంతెత్తి బొబ్బలెట్టిన విషయాన్నే, యేమాత్రం ఉద్రేకం లేకుండా సాదాగా అప్పజెప్తున్నాడాయన. జ్యూరీ సభ్యులు చేతులు ఎక్కడ పెట్టుకోవాలో తాత్కాలికంగా మరచిపోయిన గాంధీనువహోత్సుడి కోతుల్లా చూచున్నారు.

జడ్జి గోస్వామి ఇండియన్ పీనల్ కోడ్‌లోని వివిధ అధికరణాల్ని ఏకరువు పెడుతున్నాడు. ప్రాసిక్యూషన్

సాక్ష్యాన్నీ, తన చేతగాని తనాన్నీ గౌరవపూర్వకమైన భాషలో వివరించాడు. ఒకసారి తలెత్తి జడ్జి గోస్వామి తనవైపు చూసి మళ్ళీ తన ముందున్న కాగితాల మీదకి తల వాల్చాడు.

“....ప్రకారం ముద్దాయి కరుణాకర్ కి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది....”

కరుణాకర్ తల చివాల్న పైకి లేచింది. యావజ్జీవ కారాగార శిక్ష! తను యింకా జీవించాలా? అన్యాయం!

“నో!” కరుణాకర్ కంఠం శంఖంలా కోర్టు హాల్లో మారుమ్రోగింది. అతని తల పిచ్చిగా అటూ యిటూ ఊగుతోంది. బోను ఫ్రేమ్ చుట్టూ అతని చేతులు బిగుసుకున్నాయి.

నివురు తొలగిపోయిన నిప్పుల్లా వున్న కళ్ళతో అతను జడ్జి వేపు రౌద్రంగా, ఆవేశంగా చూశాడు.

“నో! నన్ను బతికనివ్వకండి! నాకు మరణశిక్ష విధించండి! నన్ను ఉరితీయండి!”

కరుణాకర్ పూనకం వచ్చినవాడిలా అరవసాగేడు. అతని మొహం చెమటతో తడిసిపోతోంది. కళ్ళు రక్తంలో మునిగినట్టున్నాయి. జడ్జి అయోమయంగా చూస్తూ సుత్తితో చరిచాడు. కోర్టులో కలకలం.

కరుణాకర్ అరుస్తూ తలని బోనుకేసి గట్టిగా కొట్టుకోసాగాడు. నుదురు చిట్లుతోంది. రక్తం కారుతోంది.

“నన్ను ఉరితీయండి! ఉరితీయండి!” కరుణాకర్ అరుపుల్ని, బోనుకి తాకుతున్న అతని తల చేస్తున్న శబ్దం పంక్చుయేట్ చేస్తోంది.

రెండు చేతులు వెనకనుంచీ అతన్ని బలంగా లాగి

పట్టాయి. అతని కళ్ళముందు యేవో మెరుపులు మెరుస్తున్నాయి. రిపోర్టర్స్ కూచున్నవైపు నుండీ ఫ్లాష్‌లు జిగేల్ జిగేల్ మంటున్నాయి.

కరుణాకర్ ముఖం రక్తసిక్తంగావుంది. అతని తలలో యేవో రాకెట్లు దూసుకెళ్తున్నాయి. తనని బలంగా పట్టుకున్న చేతులకి తన శరీరాన్ని అప్పగించి, కళ్ళు మూసుకుని, తన తలలో దూసుకెళ్తున్న రాకెట్లో ప్రయాణం చేయసాగాడతను....

* * *

నల్ల గళ్ళబనీను; నిక్కరు. ఎండిపోయిన చింపిరి జుట్టు. ఒత్తుగా పెరిగిన గెడ్డం. కొడిగట్టి, ఆరిపోడానికి సిద్ధంగా వున్న దీపాల్లాంటి కళ్ళు. ఇసుక జల్లెడలాంటి మెష్ వెనుక నుంచున్న కరుణాకర్‌ని మనోజ్ విచారంలో చూశాడు. కరుణాకర్ పెదవులు అదురుతున్నాయి.

“అన్నయ్యా....” మనోజ్ కంఠంలో విచారం బరువుగా ధ్వనించింది.

ఉద్రేకాన్ని అణుచుకుంటూ, వెర్రివాడిలా చూశాడు కరుణాకర్. తను తమ్ముణ్ని చూసి రెండేళ్ళయింది. ఈ రెండేళ్ళలో మనోజ్ ఆకారం బాగా మారింది. పొడుగ్గా వున్న మనోజ్ శరీరం కండలు తిరిగి బాగా గట్టిపడింది. మొహం ఆరోగ్యంతో మెరుస్తోంది. పొట్టిగా కత్తిరించిన క్రాఫు సన్నటి మీసాలు పెదవుల చివర్ల దాకా సాగేయి. మిలిటరీ క్రమశిక్షణ మనోజ్ శరీరంమీద తన ప్రభావం చూపిస్తోంది....

“నీ తమ్ముడు చచ్చిపోయాడనుకున్నావా?” మనోజ్ కంఠం విని, కరుణాకర్ ఉలిక్కిపడ్డాడు.

“తమ్ముడూ....”

"ఆయన ఉత్తరం రాయకపోతే, ఈ దారుణంగురించి తెలిసేది కాదు. నీ కష్టసుఖాలతో నాకు పని లేదనుకున్నావా, అన్నయ్యా!" మనోజ్ కంఠంలో ఆక్షేపణా విచారం కలిసివున్నాయి.

"తమ్ముడూ" కరుణాకర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మనోజ్ అతని మొహంలోకి చూశాడు. "ఈ ఘోరం ఎందుకు జరిగింది? ఎవరు చేశారు?"

కరుణాకర్ తల బలహీనంగా కదిలింది. "తెలీదు...."

"నీ భార్యనూ, నీ అసిస్టెంట్‌నూ పొట్టన పెట్టుకుని, నిన్ను ఇలా జీవచ్ఛవంలా మార్చే శత్రువులు నీకున్నారని నాకు తెలీదన్నయ్యా!"

"తమ్ముడూ!" కరుణాకర్ ఎర్రటి కళ్ళలో ఆశ్చర్యం.

"అన్నయ్యా, నిజం చెప్పు. నువ్వు ఎవ్వరికి ఏ అపకారం చేశావు?"

"నేను ఎవ్వరికీ అపకారం చేయనని నీకు తెలుసు?"

"తెలుసు. అయితే ఈ అన్యాయం యెందుకు జరిగింది? యేదో బలమైన కారణం లేకుండా యెవ్వరూ ఇలాంటి దారుణం చెయ్యరు."

"తమ్ముడూ....నువ్వన్నది నిజమే. అయితే ఎవరు, ఎందుకు చేశారో నేను ఊహించలేకుండా వున్నాను" కరుణాకర్ నీరసంగా అన్నాడు.

"నీ మూలంగా కోర్టులో వోడిపోయి, శిక్ష అనుభవించిన వ్యక్తి, విషంలా పగని పెంచుకున్న వ్యక్తి— యెవరేనా వుండొచ్చు. గుర్తుచేసుకో అన్నయ్యా...."

కరుణాకర్ తల బలహీనంగా, అడ్డంగా ఊగింది. అతని చూపుల్లో నిరాశా, నిస్పృహలు రూపందాల్చాయి.

"ఎవ్వరూ లేరు....అయినా దేన్నీ గుర్తుచేసుకోడం నాకు

ఇష్టంలేదు!"

"ఎందుకు ఇష్టంలేదు?" మనోజ్ తీక్షణంగా అడిగాడు.

"విరిగిపోయిన పాలని పూర్వస్థితికి తీసుకురాలేవు. అంతా మరిచిపో, తమ్ముడూ...." కరుణాకర్ కంఠం దీనంగా వుంది.

మనోజ్ అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "వదిననూ, వదిన హత్యనూ, నువ్వు బతుకుతున్న నీడ బతుకునూ మరిచిపోలేనన్నయ్యా!"

కరుణాకర్ తమ్ముణ్ని సానుభూతితో చూస్తూ నిట్టూర్చాడు.

"కొన్ని విషయాల్ని మరిచిపోవడం మంచిది, మనోజ్. గుర్తుంచుకొని నువ్వు చేయగలిగిందేమీలేదు. ఏదో తెలీని వస్తువుకోసం చీకట్లో వెతకలేవు!"

"అన్నయ్యా!"

కరుణాకర్ ఉలిక్కిపడ్డాడు. మనోజ్ కళ్ళు చంద్ర నిప్పుల్లా తయారయ్యాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. నుదుమీది నరాలు పురెక్కిన నులకల్లా అవుపించసాగేయి.

"ఎవరో తెలుసుకుంటాను. చీకటిని వెలుతురుగా మార్చి వెతుకుతాను? వెతికి...."

"మనోజ్!" కరుణాకర్ కంగారుగా అరిచాడు. మనోజ్ అతన్ని తీక్షణంగా, రెప్పవేయకుండా చూశాడు.

"అన్నయ్యా, నువ్వు నేరం చేశావా?"

కరుణాకర్ దెబ్బతిన్నట్టు చూశాడు. కళ్ళల్లోంచి వ్యథ తొంగిచూస్తోంది. "నేను నేరం చేయలేదనీ, చేయ

నని నీకు తెలుసు!" .

మనోజ్ కళ్ళు సానబట్టిన వజ్రాల్లా మెరుస్తున్నాయి. "నువ్వు చేయలేదు. ఎవరో చేశారు. వదిననూ గర్భంలోని పసిబిడ్డనూ, అమాయకమైన గీతనూ హతమార్చారు. నిన్ను హంతకుడిగా చిత్రించి, నిరూపించి ఇక్కడికి సరఫరా చేశారు. పెసిమిస్టిక్‌గా, బలహీనంగా ప్రవర్తించి నువ్వు వాళ్ళకి పరోక్షంగా సహాయం చేశావు. నిన్ను జెయిల్లో పడేయాలన్న వాళ్ళ ప్రయత్నానికి చేతులారా సాయం చేశావు! వాళ్ళెవరో—ఎవరైనాసరే, నానుండి తప్పించుకోలేరు!"

"తమ్ముడూ!" కరుణాకర్ కంఠంలోని ఆందోళన మనోజ్‌ని ఆశ్చర్యంలో నింపింది. అతను ప్రశ్నార్థకంగా చూశాడు.

"మనోజ్, నీ మాటలు నాకెంతో ఆనందాన్నీ, తృప్తినీ ఇస్తున్నాయి. నాకెంతో గర్వంగా వుంది. నా మాట విను; జరిగిన నష్టం భర్తీ కాదు. జరిగిందంతా మర్చిపో. నన్ను మరిచిపో. ఉద్యోగం చేసే ప్రదేశానికి వెళ్ళిపో. పెళ్లాడు హాయిగా బతుకు. ఇటు వేపు....ఇటు వేపు రావొద్దు...."

"అన్నయ్యా!"

"నర్మద పోయాక నాలోంచీ అంతా వెళ్ళిపోయింది. ఉరిశిక్ష పడుతుందని ఎంతో, ఎంతో ఆశించాను. ప్రయత్నించినా, ప్రయత్నించికపోయినా నాకు శిక్ష తప్పదని తెలుసు. కానీ.... నేను ఆశించిన శిక్ష నాకు లభించలేదు!"

"అన్నయ్యా ..."

"నేను దారుణంగా, భయంకరంగా వోడిపోయాను.

ఇంక ఎలాంటి గెలుపైనా, ఎవరు సాధించినా నాకు ఉపయోగించదు, తమ్ముడూ!"

మనోజ్ అతన్ని సానుభూతితో చూశాడు.

"ఇదికూడా వేరే సంగతే! నువ్వు సహించిన, సహిస్తున్న అన్యాయాల్ని నేను సహించను అన్నయ్యా!" మనోజ్ కంఠం సయాగరాలా ధ్వనించింది.

"మనోజ్, బడుద్దాయిలా మాట్లాడకు వెళ్ళు!" కరుణాకర్ గద్దించాడు.

మనోజ్ అతన్ని చిరునవ్వుతో చూశాడు. "చిన్న తనంనుంచీ అందరూ నన్ను బడుద్దాయి అన్నారు చదువు అబ్బని నేను అందరికీ. చివరికి నీకు కూడా బడుద్దాయిలా కనిపించాను. అందుకే ఆర్మీలో జవానుగా చేరిపోయాను. చదువూ, సంస్కారం లేకపోయినా నేను లోకం చూశాను. పుస్తకాలు చదవకపోయినా మనుషుల్ని చదివాను. అయినా లా చదువుకున్న నీ దృష్టిలో నేనింకా బడుద్దాయిలాగే వున్నాను! ఆల్ రైట్ ...."

"తమ్ముడూ, అయాం సారీ. నాకు తెలీని, అర్థం కాని ఊబి యేదో నన్నిలా చేసింది. ఆ ఊబిలోకి దిగితే నువ్వు తిరిగి పైకి రాలేవు...."

మనోజ్ చిన్నగా నవ్వాడు. "నాకు పిరికిమందు పోస్తున్నావా, అన్నయ్యా?"

"మనోజ్, నా అజ్ఞాత శత్రువు ఆరితేరిన చదరంగం ఆటగాడిలా చాకచక్యంగా అంతా ముందే ప్లాన్ చేసి సిద్ధం చేసుకున్నాడు. మనిషిని చంపే ముందే చితి పేర్చి సిద్ధంగా వుంచాడు. అతను ...."

"నా శత్రువుని నువ్వు పొగడుతూంటే నేను సహించలేను, అన్నయ్యా!"

"మనోజ్, అతన్ని మరిచిపో. నన్ను మరిచిపో...."

"అసంభవం!" మనోజ్ ఉద్రేకంతో అరిచాడు. నిదానించి కరుణాకర్‌ని చూశాడు. "అన్నయ్యా, మళ్ళీ అడుగుతున్నా! వదినని, గీతనీ నువ్వే హత్య చేశావా?"

"మనోజ్!"

"ఈ దారుణం చేసిన రాక్షసుడికోసం నేను అన్వేషిస్తాను. ఈ చేతుల్తో నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తాను. నా అన్వేషణ నన్ను నీ దగ్గరకి తీసుకవచ్చినా అంతే!" మనోజ్ కంఠంలో పట్టుదల ధ్వనించింది.

"తమ్ముడూ...."

"దీనికంతా కారణమైన రాక్షసుడి శవం తప్పా ఈ లోకంలో యేదీ నన్ను ఆపలేదు అన్నయ్యా!" మనోజ్ గిరుక్కున వెనుదిరిగాడు.

"మనోజ్...." కరుణాకర్ గాబరాగా అరిచాడు.

మనోజ్ ఆగలేదు. వెనక్కి తిరగలేదు, హుందాగా, వేగంగా నడుస్తూ తననుంచీ దూరంగా వెళ్ళిపోతున్న తమ్ముణ్ణి చూస్తూ తలని తనముందున్న మెష్‌కి ఆన్చాడు కరుణాకర్. అతనిలో సుళ్ళు తిరుగుతున్న దుఃఖం అశ్రుకణాలుగా మారింది.

• • •

అప్పుడే చీకటి పడుతోంది. గేటు తోసుకొని ఇద్దరూ లోపల ప్రవేశించారు. పెద్ద కాంపౌండు మధ్యలో చిన్నగా, అందంగా కట్టించిన ఇంటిని పరిశీలనగా చూస్తూ పొడుగాటి వ్యక్తి ముందు నడుస్తున్నాడు. పొట్టిగా, సన్నగా వున్న వ్యక్తి గేటుని మునుపట్లా మూసేసి, అతన్ని అనుసరించాడు.

ఇద్దరూ వరండా చేరుకున్నారు. గ్లవ్స్ ధరించిన

చేతులో పొడగాటి వ్యక్తి తలుపుకి వేళ్ళాడుతున్న తాళాన్ని పట్టుకున్నాడు. గాద్రెజ్ తాళం! అతని మొహంమ్మీద చిరునవ్వు మెరిసింది. మనుషులకి గాద్రెజ్ తాళాలమీద నమ్మకం జాస్తి. తనలాంటి వాళ్ళు చిటికన వేలి గోటితో ఆ తాళాల్ని చిటికలో తెరిచేస్తారని వాళ్ళకి తెలీదు!

జేబులోంచీ అవసరమైన ఆయుధాన్ని తీస్తూ అతను తన అనుచరుడిని సాభిప్రాయంగా చూశాడు. పొట్టి వ్యక్తి గబగబా కదిలాడు. వరండా దిగి ఇంటిని ప్రదక్షిణం చేస్తూ నడవసాగేడు.

కొసలో స్క్రూడ్రైవర్ లా వెడల్పుగా వున్న కమ్మీని అతను తాళం రంధ్రంలోకి దూర్చాడు. అతని నాలుక కొద్దిగా ఇవతలికి పొడుచుకు వచ్చింది. కమ్మీని పట్టుకున్న చెయ్యి జాగ్రత్తగా, కొద్దిగా కదిలింది.

రెండు నిమిషాల్లో లివర్స్ చిన్నగా చప్పుడు చేస్తూ తప్పుకున్నాయి. సగర్వంగా నవ్వుకుంటూ అతను, అప్పుడే తన పక్కకి చేరుకున్న అనుచరుణ్ని చూశాడు. రెండు గొగ్గిరిపళ్ళు చూపిస్తూ అతను నవ్వాడు.

తలుపు తెరుచుకుంది. పొట్టిగా వున్న వ్యక్తి ఇంట్లోకి దూరాడు. తలుపు మూసుకుంది. పొడుగాటి వ్యక్తి కమ్మీని ఉపయోగించి యథాప్రకారం తాళం వేసేశాడు. ఖాళీగా వున్న రోడ్డుని వోసారి చూసి, వరండాలోంచీ ఇంటి వెనక భాగంవేపు చకచకా నడిచాడు.

చిన్న శబ్దంతో పెరటి తలుపు తెరుచుకుంది. అనుచరుడు అతనివైపు పళ్ళికిలించాడు. వెంకల వసారాలోంచీ అతను గుమ్మం దాటి ఇంట్లోకి ప్రవేశించాడు. తలుపు మూసి, గొళ్ళెం పెట్టేసి, అతన్ని దాటుకుని

పొట్టి వ్యక్తి గునగున నడుస్తూ ముందు దారితీశాడు. మరో రెండు తలుపులు దాటి యిద్దరూ హాలు చేరుకున్నారు.

హాలు మధ్యలో స్తంభంలా నిలబడి, పొడుగాటి వ్యక్తి చుట్టూ కలయజూశాడు.

ఖరీదైన ఫర్నీచర్. కిటికీలకి తెరలు, గోడవారగా కలర్ టెలివిజన్ సెట్. టేప్ రికార్డర్. ఎడంవైపున మూసిన తలుపుమీద అతని చూపులు పడ్డాయి. పెద్ద పెద్ద అంగలో సమీపించి, తలుపుల్ని లోపలికి తోస్తూ తొంగిచూశాడతను. ఆఫీసు గది. ఎత్తుగా వున్న స్టీల్ రాక్స్‌లో వరసగా పేర్చిన పుస్తకాలు. మరోవైపున దొంతరలుగా పెట్టిన ఫైల్సు. గది మధ్యలో వెడల్పాటి ఫైల్సా. తలుపులు మూసి అతను వెనక్కి తిరిగాడు.

టైమ్ చూసుకున్నాడు. ఆమె రావడానికి మరో పది నిమిషాల వ్యవధి వుంది.

హాలు మధ్యలో వున్న బాస్కెట్ ఛెయిర్ని గోడవారగా లాగి, తలుపు పక్కకి జరిపి, కాళ్ళు ముందుకి చాస్తూ కూచున్నాడతను. జేబులోంచి జర్దాబీడా తీసి నోట్లో దోపుకుని సావధానంగా రుబ్బడం ప్రారంభించాడు. అనుచరుడిని చిరునవ్వుతో చూస్తూ మరో కుర్చీ వైపు సైగ చేశాడు.

పొట్టివ్యక్తి తల అడ్డంగా ఆడిస్తూ కదిలాడు. తలుపుకి కుడివైపున గోడకి జార్లాపడ్డాడు. సగం నమిలిన చుట్టను జేబులోంచి తీసి, పళ్ళఇరికించి. తృప్తికరంగా నమలడం ప్రారంభించాడు.

• • •

ఆటో ఆగింది.

మోటర్ పెకం చెల్లించి శాంత కిందికి దిగింది. గేటు తోసుకుని తోటలోకి ప్రవేశించింది.

వరండా ముందు కారు లేదు. తన భర్త యింకా యింటికి యెందుకు రాలేదా అనుకుంటూ శాంత అడుగులు వేయసాగింది.

తనూ, భర్తా స్వయంగా నీళ్ళుపోసి పెంచుతోన్న మొక్కల్లోంచీ పూలు వెదజల్లుతున్న సువాసనల్ని ఆఘ్రాణిస్తూ మెట్లెక్కి వరండా చేరుకుంది. కూనిరాగం తీస్తూ, పర్సులోంచీ తాళంచెవి తీసి తలుపు తెరిచింది. లోపల అంతగా వెల్తురు లేదు. గుమ్మం దాటి తలుపు మూసి, పక్కనేవున్న స్విచ్చి కోసం చెయ్యి చాచింది.

కొంచెందూరం సాగిన ఆమె చెయ్యి మధ్యలో ఆగింది. శాంత శరీరం వొక్కసారి జలదరించింది.

నునుపుగా రబ్బరులా వున్న చెయ్యి ఆమె చేతిని పట్టుకుంది. మరో చెయ్యి ఆమె నోటిని బలంగా, ప్రెషర్ కుక్కర్ మూతలా కప్పేసింది. మూడో చెయ్యి ఆమె తల వెనుకభాగాన్ని పట్టుకుంది. రెండు చేతుల మధ్య ఆమె తల కదలడానికి వీల్లేకుండా ఇరుక్కుంది.

చటుక్కున లైటు వెలిగింది. శాంత భయంతో, ఆందోళనతో విడిలించుకునే ప్రయత్నం చేసింది. ఆమె కనుగుడ్లు అటూ యిటూ, యిటూ అటూ వేగంగా కదిలాయి.

"మిసెస్ రంగనాథ్, భయపడకండి!" ఏదో కంఠం ఆమె చెవిలో రహస్యం చెప్తున్నట్టు బుసకొట్టింది.

జర్దా వాసన ఘాటుగా ఆమె ముక్కుకి సోకింది. ఆమె గుండె డప్పులా మ్రోగడం ప్రారంభించింది.

తనకి కనిపించేలా కొంచెం ముందుకి జరిగిన పొడుగాటి

వ్యక్తిని కంగారుగా చూసిందామె. అప్రయత్నంగా ఆమె చేతులు కదిలాయి. రెండు చేతుల్నీ కలిపి యెవరో వెనక్కి విరిచి పట్టుకున్నట్టు ఆమె భయంతో గుర్తించింది.

“శేఃటీజీ మిసెస్ రంగనాథ్” అన్నాడు ఎదురుగా నుంచున్న వ్యక్తి.

సన్నగా, బలిష్టంగా పొడుగ్గా వున్నాడతను. చిందర వందరగా వున్న క్రాపు అతని నుదుర్ని పూర్తిగా కప్పేసింది. గుబురుగా వున్న కనుబొమల కిందినుంచీ పాము కళ్ళు ఆమెనే తీక్షణంగా చూస్తున్నాయి. పొడుగాటి ముక్కుమీద ఎర్రటి పులిపిరికాయ. పది రోజుల క్రితం గీసుకుని వుండాల్సిన గెడ్డం. జర్దా మూలంగా ఎర్రగా, తడిగా—రక్తంతో తడిసినట్టున్న పల్చటి పెదవులు. కాంత శరీరం వణకడం ప్రారంభించింది.

ఆమె రెండు మణికట్లనీ ఒక్కటిగా కలుపుతూ సన్నటి తాడు. ఆమె వెనకవైపున బిగుసుకుంటోంది. కాంత అసంకల్పితంగా చేతుల్ని గింజుకుంది. ఆమె కళ్ళలోకి నవ్వుతూ చూస్తున్నాడతను. ఆ నవ్వు ఆమెని భయంతో, కంపరంతో నింపుతోంది.

“ఆ గదిలో లాయరుగారి పొడుగు చేతుల చొక్కా వుంటుంది పట్రా!” అనుచరుడికి ఉత్తరువిచ్చాడతను.

చేతుల్ని కట్టేయడం ముగించిన అనుచరుడు గబగబా గదిలోకి వెళ్తున్నాడు. కాంత పొట్టిగా వున్న అతన్ని వోరగా చూస్తోంది. చొక్కాతో అతను తిరిగొస్తున్నాడు. అతను కూడా గెడ్డం గీసుకోలేదు. ఎడమ చెంప మీద ప్లస్ ఆకారంతో ప్లాస్టర్ వుంది. ఏనుగు కళ్ళు. గొగ్గిరి పళ్ళ మధ్య చుట్ట నలుగుతోంది.

గట్టిగా అరవాలనీ, వాళ్ళకి ఏంకావాలో కనుక్కొని, పారేసి వెళ్ళిపొమ్మనాలనీ కాంతకి యెంతగానో వుంది. కానీ అతని అరచెయ్యి నోటిని మూసేసింది.

అతను ఆమెవైపు చిరునవ్వు నవ్వాడు. "మిసెస్ రంగనాథ్, కాసేపట్లో మీ నోటిమీదినుంచీ చేతిని తీసేస్తాను. అరిచే ప్రయత్నం చేయకండి. మీ అరుపు మీకు ప్రమాదం!" అతను కర్కశంగా అరవడంలేదు. అయినా అతని కంఠం ఆమెలో యేదో భయాన్ని పుట్టిస్తోంది.

"మిసెస్ రంగనాథ్, మీరు తొందరపడి, అరిచి, ఆ మూలంగా గాయపడకుండా వుండటానికి, మీ నోట్లో మీ ఆయన చొక్కా కూరి, గట్టిగా మూసేస్తాం. ఈ ముందుజాగ్రత్త మీ కోసమే. భయపడకండి. అరవకండి. చెప్పినట్టు వింటే మీకు యెక్కువ ప్రమాదం జరగదు!"

చెప్పినట్టు వింటే ఎక్కువ ప్రమాదం జరగదు. అంటే తక్కువ ప్రమాదం జరుగుతుందా? కాంత ఖంగారుగా ఆలోచిస్తోంది. చొక్కాని పట్టుకుని పొట్టివ్యక్తి ఆమె దగ్గరగా ఆగాడు. తన అనుచరుడి సైగను గుర్తించి చొక్కాని గుండ్రటి బంతిలా చుట్టడం ప్రారంభించాడు.

ఆమె పెదవులమీదా, బుగ్గలమీదా అతని చెయ్యి వొత్తిడి యెక్కువయింది. అతని ఎడమచెయ్యి ఆమె తలని వదిలేసింది. రెప్పపాటులో అతని పాంటు జేబులో దూరి యివతలకి వచ్చింది. అతని వేళ్ళ మధ్య యేదో ఎర్రగా మెరుస్తోంది. అతని మణికట్టు తటాలున కదిలింది. ఎర్రటి పిడిలోంచీ పదునైన కత్తి ఇవతలకి దూకింది. తళుక్కున మెరిసిన కత్తిని చూసి కాంత ఉలిక్కిపడింది. అతను కత్తిని తృప్తికరంగా చూసి కాంతవైపు నవ్వాడు.

(ఇంకా వుంది)